ఎస్సారెస్పీ గేట్ల మూసివేత
- ప్రాజెక్టుకు తగ్గుముఖం పట్టిన వరద
- ప్రధాన కాల్వలకు కొనసాగుతున్న నీటి విడుదల

4

విద్యా ప్రమాణాల మెరుగునకు కృషి చేయాలి
- బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

4

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు
- 9 ఆటోలు, 3 బైకులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సాయిచైతన్య


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీపీ సాయిచైతన్య

సుభాష్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాతో పాటు పక్కనే ఉన్న నిర్మల్ జిల్లాలో వాహనాలు దొంగిలిస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్నట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. గురువారం నగరంలోని సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, ముధోల్ పట్టణాల్లో ఆటోలు, బైక్‌లను దొంగతనాలు చేసి జగిత్యాల్, కోరుట్లలో అమ్ముతున్న దొంగల ముఠాను పక్కా సమాచారం మేరకు పట్టుకున్నట్లు సీపీ తెలిపారు. ఆటోనగర్‌కు చెందిన షేక్ ఫజీల్, మహ్మద్ నవాజ్‌లను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరితో పాటు షేక్ అలీ, అలీమ్, వహీద్‌తో కలిసి 9 ఆటోలు, 3 ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసినట్లు వారు అంగీకరించారని పేర్కొన్నారు. దొంగతనం చేసిన వాహనాల నెంబర్ ప్లేట్స్, ఇంజెన్ నెంబర్, చాసీస్ నెంబర్లను మార్చి కోరుట్లకు చెందిన మహమ్మద్ ఇమ్రాన్, మహమ్మద్ ఇలియాస్‌లకు అమ్మారని అన్నారు. వారి వద్ద నుంచి 9 ఆటోలు, 3 ద్విచక్ర వాహనాలు రికవరీ చేశామని తెలిపారు. ఇందులో 4 ఆటోలు, 3 బైక్‌లకు సంబంధించిన అడ్రస్‌లు లభించాయని వీటిపై కేసులు నమోదై ఉన్నాయని అన్నారు. కొన్ని వాహనాలు మెట్‌పల్లిలో కూడా అమ్మారని అవి దొంగ వాహనాలు అని తెలియడంతో తక్కువ డబ్బులకు ఇచ్చినట్లు వారు ఒప్పుకున్నారన్నారు. దొంగతనం చేసిన వాహనాలు బోధన్ శక్కర్‌నగర్‌లోని నిర్మానుష్య ప్రాంతంలో దాచారని వారిని అదుపులోకి తీసుకొని విచారించగా పూర్తి వివరాలు తెలిసాయన్నారు. పరారీలో ఉన్న ముగ్గురిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేసును ఛేదించిన ఏసీపీ నాగేంద్రచారి, సీఐలు సాయినాథ్, సురేష్, ఎస్సైలు గోవింద్‌తో పాటు సిబ్బంది రాములు, వెంకట్రామ్, రవి, కృష్ణ, ప్రమోద్, నరేష్‌యాదవ్‌లను సీపీ అభినందించారు.

యువత ఉన్నత స్థానాల్లో స్థిరపడాలి
- పోలీసు కమిషనర్ సాయిచైతన్య

4


- పిచ్చి మొక్కల మధ్య గోన్‌గొప్పుల ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాల
- తాళం వేసి ఉన్న సంతోష్‌నగర్ ప్రాథమికపాఠశాల

మూతబడి
జీరో విద్యార్థుల సాకుతో పాఠశాలల మూసివేత

- ప్రభుత్వ పాఠశాలల్లో కానరాని మౌలిక వసతులు
- వేధిస్తున్న ఉపాధ్యాయుల, సిబ్బంది కొరత
- సర్కారు బడులపై ఆసక్తి చూపని తల్లిదండ్రులు
- విద్యార్థులు లేరని ఉపాధ్యాయులకు మరోచోటికి డిప్యూటేషన్
- అధికారుల పర్యవేక్షణ కొరవడి మూతపడుతున్న ప్రభుత్వ పాఠశాలలు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై పాలకులు, అధికారులు దృష్టి సారించకపోవడం, ఉపాధ్యాయుల కొరత వేధిస్తుండడం, ప్రైవేటు పాఠశాలల వైపు విద్యార్థుల తల్లిదండ్రులు మొగ్గుచూపడం వంటి కారణాలతో సర్కారు బడులు మూతబడుతున్నాయి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి 'మన ఊరు-మన బడి' కార్యక్రమాన్ని చేపట్టినా.. బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థుల చేరికలను పెంచడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోతోంది. పాత భవనాలు, మౌలిక వసతుల కొరత వంటి సమస్యల కారణంగా కొన్ని ప్రభుత్వ పాఠశాలలు మూతబడుతున్నాయి.



భీమ్‌గల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుంటే అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ కొరవడడంతో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గి రోజురోజుకూ ఉనికిని కోల్పోతున్నాయి. విద్యార్థులు లేరనే సాకుతో కొన్ని పాఠశాలలను అధికారులు మూసివేస్తున్నారు. అక్కడి సిబ్బందిని మరోచోటికి డిప్యూటేషన్‌పై పంపుతున్నారు. మరి కొంతమంది ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాల నుంచి భీమ్‌గల్‌కు వచ్చేవారు తమ ప్రాంతాలలోనే డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. భీమ్‌గల్ మండలంలో 14 ఉన్నత, 6 ప్రాథమికోన్నత, 38 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇందులో కొన్ని పాఠశాలలు జీరో విద్యార్థుల సాకుతో మూసివేస్తున్నారు. మండలంలోని సంతోష్‌నగర్, సుదర్శన్‌నగర్, గోన్ గొప్పుల ఎస్సీ కాలనీ పాఠశాలలు మూతపడ్డాయి. కొన్ని సంవత్సరాలుగా సుదర్శన్‌నగర్ ప్రాథమిక పాఠశాల ఆరుగురు విద్యార్థులతో కొనసాగుతోంది. ఇటీవల ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయుడు మరోచోటకు బదిలీపై వెళ్లగా అదే స్థానంలో ఇక్కడికి మరో ఉపాధ్యాయురాలు వచ్చింది. అయితే విద్యార్థులు లేరని సాకుతో మరోచోటికి డిప్యూటేషన్‌పై పంపించడంతో ఆ పాఠశాలలకు తాళం పడింది. ఇదే తండా నుంచి పక్క గ్రామాల్లో ప్రైవేటు పాఠశాలలకు వెళుతుండడం గమనార్హం. ప్రస్తుతం ఆ పాఠశాల భవనం గ్రామ పంచాయితీ కార్యాలయానికి వాడుకుంటున్నారు. అలాగే సుదర్శన్‌నగర్ తండా, గోన్‌గొప్పుల ఎస్సీ కాలనీలో విద్యార్థులు లేరనే సాకుతో అక్కడ ఉపాధ్యాయుల నియమించకపోవడంతో పాఠశాలలు మరుగున పడ్డాయి.

పర్యవేక్షణ కరువు..

ప్రభుత్వ పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ కొరవడంతో సిబ్బంది సమయపాలన పాటించడం లేదని

మిగతా 6వ పేజీలో...

పాఠశాలలకు విద్యార్థులు రావడం లేదు..

ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు సంతోష్‌నగర్, సుదర్శన్‌నగర్ గోన్ గొప్పుల ఎస్సీ కాలనీలో తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలను కొనసాగించేందుకు ప్రయత్నం చేశాం. కానీ విద్యార్థులు ఎవరూ రాకపోవడంతో సంతోష్‌నగర్ తండాకు కేటాయించిన ఉపాధ్యాయులను భీంగల్ పట్టణ కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపాం.


- స్వామి, మండల విద్యాధికారి, భీమ్‌గల్.


సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైన అంకిత

వైజ్ఞానిక ప్రదర్శనలో జాతీయ స్థాయికి రెంజర్ల విద్యార్థి

ముప్కాల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంజర్ల పాఠశాలకు చెందిన కె. అంకిత వైజ్ఞానిక ప్రదర్శన 2025లో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో రవి కుమార్ తెలిపారు. ఎకో ఫ్రెండ్లీఫుడ్ ప్రెసర్‌వేటివ్ టాబ్లెట్స్ పద్ధతిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో సహజ పద్ధతిలో బియ్యం, ధాన్యం చెడిపోకుండా ఉండేందుకు వీలుగా ప్రాజెక్టు తయారు చేశారు. ఈ పద్ధతిలో ధాన్యం 6 నుంచి 8 సంవత్సరాల వరకు సురక్షితంగా ఉంటుందని ఎలాంటి సైడ్ ఎఫెక్టు లేకుండా ఈ ప్రాజెక్టులో సహజంగా దొరికే అల్లం, వేపాకు, ఆవుపేడ, లవంగాలు, బిర్యాని ఆకు వాడి ఈ ప్రాజెక్టును గత జనవరిలో రూపొందించడం జరిగింది. దక్షిణ భారత స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో పదర్శించడం జరగడంతో 18 నుంచి 23 వరకు బోపాల్ పట్టణంలో జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో గ్రూప్ లీడర్ అంకిత, గైడ్ టీచర్ సుద్దపల్లి మల్లేష్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

కల్యాణ కష్టాలు..!
- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పత్రాలపై సంతకానికి సహకరించని గెజిటెడ్ ఆఫీసర్లు
- కాళ్లరిగేలా తిరుగుతున్న దరఖాస్తుదారులు

6

కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలి
- సీఎంను కించపరిచేచే విధంగా సోషల్ మీడియాలో పోస్టులను ఖండిస్తున్నాం
- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్
- సీపీ కార్యాలయం ముట్టడించిన కాంగ్రెస్ నాయకులు


సీపీ కార్యాలయానికి ర్యాలీగా వస్తున్న నాయకులు

నిజామాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ మంత్రి కేటీఆర్ తన అధికారిక సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కించపరిచే విధంగా పోస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం సీపీ కార్యాలయాన్ని ముట్టడించారు. కేటీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సీపీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. రాష్ట్రంలో విద్యార్థులు, యువత మనోభావాలు దెబ్బతీసే విధంగా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారని దీనికి పూర్తి బాధ్యత కేటీఆర్ వహించాలని అన్నారు. కేటీఆర్‌పై చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుందని అన్నారు. కమిషనరేట్‌ను ముట్టడించిన పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సీపీ సాయి చైతన్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు తాహెర్‌బిన్ హందాన్, గడుగు గంగాధర్, రత్నాకర్, వేణురాజ్, విపుల్ పాల్గొన్నారు.



సీపీకి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు


చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బిగాల

మాక్లూర్ పాఠశాలకు రూ.కోటి విరాళం
- కలెక్టర్‌కు చెక్కును అందజేసిన మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త

నిజామాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాక్లూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అర్బన్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త కోటి రూపాయల విరాళం అందజేశారు. గురువారం ఆయన సోదరుడు బిగాల మహేష్ కుమార్‌తో కలిసి సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఉన్నారు.

కల్లాలు.. రైతు నేస్తాలు
- ఉపాధి హామీలో నిర్మాణాలకు కేంద్రం అంగీకారం
- ఆసక్తి చూపుతున్న రైతులు
- అధికారులు అవగాహన కల్పిస్తే మరింత ప్రయోజనం

4

జిల్లా కీర్తి కిరీటంలో వ్యవసాయ కళాశాల
- కేబినెట్‌లో నిర్ణయం
- ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు
- కీలకపాత్ర పోషించిన పీసీసీ అధ్యక్షుడు

నిజామాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు చేస్తూ రాష్ట్ర కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు కేబినెట్లో మొదటి విడుదగా రూ.47 కోట్లు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మూడు విడతల్లో మొత్తం రూ.124 కోట్లు మంజూరు చేయనున్నారు. రెండో విడుతలో రూ.47 కోట్లు, మూడో విడతలో రూ. 30 కోట్లు విడుదల చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు వ్యవసాయ కళాశాలలో మంజూరయ్యాయి. హుజూర్‌నగర్, కొడంగల్‌తో పాటు నిజామాబాద్ జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు చేశారు. వ్యవసాయ కళాశాల మంజూరులో జిల్లాకు చెందిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కీలకపాత్ర పోషించారు. ఇటీవల జిల్లాకు వచ్చిన సందర్భంగా ఆయన త్వరలోనే జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు అవుతుందని ప్రకటించారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా మొదటిసారి జిల్లాకు వచ్చిన సందర్భంగా జిల్లాకు ఇంజనీరింగ్ కళాశాల తీసుకువస్తామని ప్రకటించగా ఇటీవలే తెలంగాణ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల మంజూరై ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఎన్నో ఏళ్లుగా జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్న వ్యవసాయ కళాశాల కూడా జిల్లాకు రావడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో పాటు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి వ్యవసాయ కళాశాల మంజూరుపై సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.



ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

మాక్లూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్లి గ్రామంలో ఇంటర్ విద్యార్థి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన వెంకట్(16) అనే విద్యార్థి ధర్మారం మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చదువులో వెనుకబాటు తనంతో బాధపడుతున్నాడు. దసరా సెలవులకు వచ్చిన వెంకట్ ఇంకా కళాశాలకు వెళ్లలేదు. గురువారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న మాక్లూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ
- మూడున్నర తులాల బంగారం, ఐదు తులాల వెండి అపహరణ

4

రైతును రాజును చేయడమే లక్ష్యం
- ధాన్యం, మొక్కజొన్న పంట ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం
- రైతులు ఆందోళన చెందవల్సిన అవసరం లేదు
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతును రాజును చేయడమే లక్ష్యంగా రైతులకు పలు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మునిపల్లి, అర్గుల్ గ్రామాలలో సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మునిపల్లిలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వానాకాలంలో జిల్లాలో లక్షా మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట, తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసిందన్నారు. గత ఏడాది రాష్ట్రంలోనే జిల్లా ధాన్యం కొనుగోలులో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. మునిపల్లిలో వివిధ అభివృద్ధి పనులకు 2 కోట్ల 78 లక్షల రూపాయల నిధులను మంజూరయ్యాయన్నారు. త్వరలో గుత్ప లిఫ్ట్ పనులను పూర్తి చేయించి ఈ లిఫ్ట్ ద్వారా మునిపల్లి, లక్ష్మాపూర్, నారాయణ పేట్, అర్గుల్, జక్రాన్‌పల్లి గ్రామాల రైతాంగానికి పంటలకు సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎం. సాయిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, సొసైటీల చైర్మన్‌లు ఆర్మూర్ గంగారెడ్డి, కాటిపల్లి నర్సారెడ్డి, నాగుల శ్రీనివాస్, తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీవో యూసుఫ్‌ఖాన్, విండో కార్యదర్శులు మల్లయ్య, తిరుపతి రెడ్డి, విండోల డైరెక్టర్లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.


లక్ష్మాపూర్‌లో మొక్కజొన్న రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను
వేగవంతం చేయండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

- ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై కలెక్టర్ సమీక్ష

సుభాష్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి కనిపించేలా కృషి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై, డబుల్ బెడ్రూంల పంపిణీ ప్రక్రియపై కలెక్టర్ గురువారం ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఒక్కో మండలం వారీగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని, వాటిలో ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి, ఎన్ని ఇండ్లు ఏ దశలో నిర్మాణంలో ఉన్నాయి, ఇప్పటివరకు గ్రౌండింగ్ జరగని ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులచే పనులు ప్రారంభించేలా చేపట్టిన చర్యలు ఏమిటి తదితర వివరాలను అడిగితెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలలో వెనుకంజలో ఉన్న ఆయా మండలాల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తూ, నిర్దేశిత లక్ష్యాల సాధన కోసం స్పష్టమైన దిశానిర్దేశం చేస్తున్నప్పటికీ, ఎందుకు పురోగతి సాధించడం లేదని నిలదీశారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహిస్తూ, క్షేత్ర స్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణాలు చేపట్టేలా చూడాలని

మిగతా 6వ పేజీలో...

సీపీఆర్‌పై అవగాహన అవసరం
- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

6

క్రైం సమాచారం

గుర్తుతెలియని వ్యక్తి హత్య

» కాలిన మృతదేహం లభ్యం

గాంధారి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం నుంచి చద్మల్ వెళ్లే దారిపక్కన గుంతలో ఓ వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి నిప్పటించినట్లు ఉందని ఎస్‌ఐ ఆంజనేయులు గురువారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకొని చూడగా.. కొద్ది వరకు కాలిన మృతదేహాన్ని కనిపించిందన్నారు. దుండగులు గుర్తుతెలియని వ్యక్తిని ఇక్కడే హత్య చేశారా..? మరేక్కడైనా హత్య చేసి ఇక్కడికి తీసుకువచ్చి కాల్చడానికి ప్రయత్నించారా..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మృతదేహంపై నీలి రంగు జీన్స్ ప్యాంటు, తెల్లని బనియన్, నలుపు, తెలుపు గీత చొక్కా కలి గి ఉందన్నారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తుపడితే గాంధారి పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు వివరించారు.

మహిళ అదృశ్యం

లింగంపేట, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన బైండ్ల గంగమణి గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిందని ఆమె భర్త సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. సాయిలుకు గంగమణి, భూమవ్వ అనే ఇద్దరు భార్యలున్నారు. వీరిద్దరు గొడవ పడగా గంగమణి 13వ తేదీన ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదుచేశారు.

నవీపేట మండలంలో విద్యార్థి..

నవీపేట,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరన్‌పల్లికి చెందిన ఎత్తారి సాయికుమార్ అనే 13 ఏళ్ల విద్యార్థి బుధవారం అదృశ్యమయ్యాడని ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. మండలంలోని జన్నేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో 6వ తరగతి చదువుతున్న సాయికుమార్ యథావిధిగా బుధవారం పాఠశాలకు వెళ్లగా సాయంత్రానికి ఇంటికి చేరుకోలేదన్నారు. ఆచూకీ గురించి వెతికినప్పటికీ సమాచారం లభించలేదని ఎస్‌ఐ పేర్కొన్నారు. సాయికుమార్ ఎరుపు రంగు స్కూల్ డ్రెస్ ప్యాంటు, షర్ట్ ధరించి ఉన్నాడని అతని ఆచూకి లభిస్తే నవీపేట పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సాయికుమార్ పెద్దమ్మ సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామన్నారు.

రూ.3లక్షల విలువైన టపాకాయలు స్వాధీనం

నిజామాబాద్, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అనుమతులు లేకుండా నగరంలోని గుర్బాబాది రోడ్‌లో అమ్ముతున్న టపాకాయలను 3వ టౌన్ ఎస్సై హరిబాబు, అగ్నిమాపక అధికారి శంకర్ స్వాధీనం చేసుకున్నారు. గురువారం తనిఖీ చేసి 29 రకాల రూ.3లక్షల విలువ చేసే టపాకాయలను సీజ్ చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా సేఫ్టీ నిబంధనలు పాటించకుండా అమ్ముతున్న రాఘవపై కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నిబంధనలు విరుద్ధంగా టపాకాయల అమ్మకాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుట్కా తయారు చేస్తున్న ఫ్యాక్టరీ సీజ్

సుభాష్‌నగర్, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతంలో అక్రమంగా గుట్కా తయారు చేస్తున్న ఫ్యాక్టరీని సీసీఎస్ పోలీసులు సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఫ్యాక్టరీపై గురువారం దాడులు నిర్వహించారు. గుట్కా తయారు చేస్తున్న సామాగ్రిని స్వాధీనం చేసుకోవడంతో పాటు తయారీదారులు అస్సాం, అమీర్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి.. 9 మంది అరెస్ట్

సుభాష్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రదేశాల్లో పేకాట స్థావరాలపై సీసీఎస్ బృందం దాడి చేసింది. రూరల్ స్టేషన్ పరిధిలోని గంగాస్థాన్ ఫేస్-1 లక్ష్మీనర్సింహా అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు నిర్వహించగా 9మంది పేకాట రాయుళ్లతో పాటు 9 సెల్ ఫోన్‌లు, 49వేల 250 రూపాయల నదును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ నాగేంద్రచారి తెలిపారు. సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు నిర్వహించిన తనిఖీలో తదుపరి దర్యాప్తు కోసం రూరల్ పోలీసులకు అప్పగించారు. ఈ తనిఖీలో సీఐ సురేష్, సాయినాథ్, ఎస్సై గోవింద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడి ఇంట్లో అన్న చోరీ


నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

సుభాష్‌నగర్, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి): తమ్ముడి ఇంట్లోనే చోరీకి అన్న పాల్పడిన సంఘటన నగరంలోని 2వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వ్యాపారంలో నష్టం రావడంతో తమ్ముడి వద్ద ఉన్న సొమ్ముపై కన్నేసిన అన్న చోరీకి పాల్పడినట్లు సీఐ శ్రీనివాస్‌రాజు తెలిపారు. మహమ్మదీయ కాలనీలో నివాసం ఉంటున్న నిందితుడు హమ్మద్ షఫీ పాషా తమ్ముడు హమ్మద్ షాబీర్ పాషా ఇంట్లో చొరబడి రూ.7లక్షల నగదుతో పాటు 2 తులాల బంగారాన్ని దొంగిలించినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

● **తాళం వేసిన ఇంట్లో..**

మెపాల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన నిజామాబాద్ మండలం గుండారంలో గురువారం వెలుగు చూసింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన స్వర్గం లక్ష్మి బుధవారం అదే గ్రామంలో ఉన్న చుట్టాల ఇంటికి వెళ్లింది. ఆమెకు ఓ కుమారుడు ఉన్నాడు. భర్త మరణించడంతో కుమారుడు పని నిమిత్తం గల్ఫ్ వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన ఓ దుండగుడు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. ఇదంతా ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయింది. దుండగుడు మూడున్నర తులాల బంగారం, ఐదు తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ ఆరీఫ్ తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు, క్లూస్ టీంతో ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

గంజాయి స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

సుభాష్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నిషేధిత గంజాయిని అక్రమంగా తీసుకెళ్తున్న వ్యక్తిని 3వ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రాత్రి నగరంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా తిరుగుతున్న శివతేజను ఆపి ప్రశ్నించారు. ఈ క్రమంలో అతని వద్ద నుంచి 110 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

లైసెన్స్ తీసుకుంటేనే టపాసుల అమ్మకాలు

బోధన్, అక్టోబరు16, (ఆంధ్రజ్యోతి): ఎన్‌వోసీ, లైసెన్స్‌లు తీసుకున్న తర్వాతే టపాసుల అమ్మకాలు జరపాలని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. దీపావళి సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న టపాసుల దుకాణాల యాజమానులు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. బోధన్ ఏసీపీ ద్వారా ఎన్‌వోసీ తీసుకోవాలన్నారు. మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని లైసెన్స్‌లు వచ్చిన తర్వాతే అమ్మకాలు మొదలు పెట్టాలన్నారు. దుకాణాల వద్ద అగ్నిమాపక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సీపీఆర్‌పై అవగాహన

నవీపేట,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో గురువారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. హార్ట్‌ఎటాక్, కార్డియాక్ అరెస్ట్ ఏర్పడినప్పుడు గుండె కొట్టుకోవడం ఆగిపోతుందని, వెంటనే సంబంధిత వ్యక్తికి సీపీఆర్ చేయడం ద్వారా అతని ప్రాణాలను కాపాడవచ్చని డాక్టర్ అరవింద్ పేర్కొన్నారు. ప్రతీఒక్కరు సీపీఆర్ నేర్చుకోవడం ద్వారా సమాజ ఆరోగ్య భద్రతకు దోహదం చేస్తుందన్నారు. డాక్టర్ అరవింద్ విద్యార్థులకు ప్రాక్టికల్ డెమో ద్వారా సీపీఆర్ చేసే పద్ధతిని వివరించారు. స్కూల్ కరస్పాండెంట్ హన్మాండ్లు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కల్లాలు.. రైతు నేస్తాలు


గుమ్మిర్యాల్ గ్రామంలో నిర్మించిన కల్లం

» ఉపాధి హామీలో నిర్మాణాలకు కేంద్రం అంగీకారం

» గతంలో మండలంలో 258 నిర్మాణాలు » ఆసక్తి చూపుతున్న రైతులు » అధికారులు అవగాహన కల్పిస్తే మరింత ప్రయోజనం

ఏర్గట్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ఉత్పత్తులను ఆరబెట్టడానికి అవసరమయ్యే కల్లాల నిర్మాణానికి కేంద్రం నుంచి మార్గదర్శకాలు వెలువడటం తో రైతులకు లబ్ధి చేకూరనుంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా కల్లాల నిర్మాణాలు చేసుకునేలా అంగీకారం తె లుపగా ఇంకా.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. గత రెండేళ్లలో ఈ పథకం అమల్లో ఉండ గా మండలంలో మొత్తం 258మంది రైతులు కల్లాలను నిర్మించుకున్నారు.

తరచూ రోడ్డు ప్రమాదాలు

రైతులు పంట ఉత్పత్తులను రోడ్లపైన ఆరబెట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడమే కాక రోడ్డు ప్రమాదాలు జరిగిన ఘటనలున్నాయి. దీంతో కొంతమంది రైతులపైన కేసులు నమోదైన సందర్భాలు లేకపోలేవు. ధాన్యం ఆరబెట్టేందుకు అద్దె ప్రాతిపదికన టార్పాలిన్లు తీసుకున్న వారు ఏటా కనీసం రూ. 2 వేల నుంచి 3 వేలు వరకు నష్టపోతున్నారు. ఈ పథకం అమలులో ఉండగానే మండలంలో చాలా మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. కొందరు రైతులు నిర్మాణాలకు సంబంధించి ముగ్గు పోసుకొని పునాదుల తవ్వకాలు చేపట్టారు. ఈ క్రమంలో అర్థాంతరంగా కల్లాల నిర్మాణ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ పథకాన్ని ప్రారంభించిన ఏడాదిన్నరకే రద్దు చేసిన కేంద్రం తాజాగా ఈ పథకానికి అంగీకారం తెలిపింది. ఈ సారి చాలా మంది రైతులు కల్లాల నిర్మాణాలకు ఆసక్తి చూపుతున్నారు. పంట ఉత్పత్తులు ఆరబెట్టడంలో ఎలాంటి ఇబ్బందులుండవు.

గతంలో అంతగా అవగాహన లేదు..



ధాన్యం ఉత్పత్తులను ఆరబెట్టుకోవడానికి రైతులకు కల్లాల నిర్మాణం అత్యవసరం. గతంలో ఒకసారి కేంద్ర ప్రభుత్వం అనుమతించగా, సరియైన అవగాహన లేక చాలామంది రైతులు నిర్మించుకోలేకపోయారు. కేంద్రం సానుకూలంగా స్పందించడం సంతోషకరం. ఈసారి భారీగా కల్లెలు నిర్మించుకుంటాం **- సోమ రాజారెడ్డి, రైతు గుమ్మిర్యాల్**

మార్గదర్శకాలు వస్తే దరఖాస్తులు స్వీకరిస్తాం



రైతులకు కల్లాల నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి ఇంకా మార్గదర్శకాలు విడుదల కాలేదు. మార్గదర్శకాలు జారీ చేసిన వెంటనే రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తాం. ఉపాధిహామీలో భాగంగా కల్లాల నిర్మాణానికి దరఖాస్తులు స్వీకరిస్తాం. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. రైతులు కూడా కల్లాలు నిర్మించుకునేందుకు ముందుకు రావాలి. **- విద్యానంద్, ఏపీవో, ఏర్గట్ల**


మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

పనులు వేగంగా చేయాలి

» ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పట్టణంలో రూ.47కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టాలని, ఎక్కడ అవసరం ఉందో అధికారులు నిర్ణయించి రాజకీయ నాయకులకు సంబంధం లేకుండా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిధులను ఉపయోగించుకోవాలన్నారు. పట్టణంలో గంజాయి అసంఘటిత శక్తులను అరికట్టేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. దీపావళిని పురస్కరించుకొని టపాకాయల విక్రయదారులు లైసెన్సులు పొంది వ్యాపారం చేసుకోవాలన్నారు. దళారులను ఆశ్రయించి ఆర్థిక ఇబ్బందులకు గురికావద్దని తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన బీజేపీ వివిధ మోర్చాల అధ్యక్షులను సన్మానించారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాపంథా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కార్యదర్శి వి.ప్రభాకర్

అర్హులకు ఇళ్లు కేటాయించాలి

మోర్తాడ్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డబుల్ బెడ్ ఇళ్లు పంపిణీ చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అర్హులకు జాబితా ప్రకారం డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని ప్రజాపంథా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కమిటి కార్యదర్శి వి. ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని అధికారులు ఖాళీ చేయించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటీవల భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయిన వారు తాత్కాలికంగా నివాసం ఉన్నారని వారు కూడా అర్హులేనని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 225 డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణం జరిగిందని, ప్రస్తు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి 155 మంది జాబితాను తయారు చేసి డబుల్ బెడ్ ఇళ్లను పంపిణీ చేశారని మాజీ సర్పంచ్ ఆనంద్ తెలిపారు. 69 ఇళ్లు ఖాళీగా ఉన్నాయని అధికారులు అర్హులకు కేటాయించాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు దేవరాం, జి.కిషన్, సత్యనారాయణగౌడ్, సురేష్, బావన్న, అశోక్, రవి, దయాల్‌సింగ్, శ్రీనివాస్, భూమగంగు, పద్మ, గంగపోసాని పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే పంటకు మద్దతు ధర


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న రాష్ట్ర సహకార కార్పొరేషన్ చైర్మన్ మానాల

కమ్మర్‌పల్లి, అక్టోబరు 16:(ఆంధ్రజ్యోతి): రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని రాష్ట్ర సహకార చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం కమ్మర్‌పల్లి మండలంలోని ఆమీర్‌నగర్, నర్సాపూర్‌లో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యమైన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కేంద్రాలవద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, డైరెక్టర్ మధులత శ్రీనివాస్, నాయకులు రాములు నాయక్, రవి, బాపురెడ్డి, ప్రవీన్, బుచ్చిమల్లయ్య, రాజేందర్, భూమారెడ్డి తదితరులున్నారు.

దళారులకు అమ్మినష్టపోవద్దు

వేల్పూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించాలని డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని సొసైటీ వద్ద ఆయన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ వరి ధాన్యానికి 2389, బి గ్రేడ్‌కు 2369 రూపాయల మద్దతు ధర అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ బైరి శ్రీదర్, డైరెక్టర్లు, సొసైటీ కార్యదర్శులు కృష్ణ, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులున్నారు.


వేల్పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

సాలూర,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): సాలూర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం సంఘ చైర్మన్ అల్లె జనార్ధన్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సిబ్బందికి సహకరిస్తూ రైతులు ధాన్యాన్ని విక్రయించాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి సందేహాలు ఉన్న సిబ్బందికి అడిగి తెలుసుకుని సమన్వయం పాటిస్తూ ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ వైస్ చైర్మన్ సందీప్ రెడ్డి, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కల్లెడిలో ఏర్పాటుచేసిన కొనుగోలుకేంద్రాన్ని గురువారం మాక్లూర్ సొసైటీ చైర్మన్ అశోక్ ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మహేష్, రమేష్, అవినాష్, భాస్కర్, నర్సారెడ్డి, బుజ్జి, బాలరాజ్ సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బోధన్,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): హంస్స సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేం ద్రాన్ని బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్ ప్రారంభించారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ వరి ధాన్యా నికి 2389, బి గ్రేడ్‌కు 2369 రూపాయల మద్దతు ధర అందిస్తుందని చైర్మన్ శంకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి అరుణ్ కుమార్, సంఘ సభ్యులు శివకుమార్, అశోక్, రాములు, మాధవరావు, కార్యదర్శి హన్మంత్‌రావు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ గేట్ల మూసివేత


ప్రాజెక్టు గేట్లను మూసివేసిన దృశ్యం

మెండోర, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద తగ్గుముఖం పట్టడంతో ప్రాజెక్టు వరద గేట్లను మూసివేసి ప్రాజెక్టు ప్రధాన కాలువలు, ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ జగదీష్ తెలిపారు. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి ఉదయం 22వేల క్యూసెక్కుల వరద చేరడంతో 4 వరద గేట్ల ద్వారా 12,500 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. వరద 9,654 క్యూసెక్కుల తగ్గడంతో గేట్లను మూసివేశారు. ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరడంతో ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదను ప్రధాన కాలువల ద్వారా విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 5000, ఎస్కేప్ గేట్ల ద్వారా 3000, లక్ష్మీ కాలువకు 200, సరస్వతి కాలువకు 650 క్యూసెక్కుల నీటి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు, 80.5 టీఎంసీలు కాగా గురువారం సాయంత్రానికి 80 టీఎంసీల నీటినిల్వ ఉంది. జూన్ 1 నుంచి ఎగువ నుంచి 873 టీఎంసీల వరద రాగా.. 805 టీఎంసీల మిగులు జలాలను కాలువల ద్వారా వరద గేట్ల ద్వారా గోదావరిలోకి విడుదల చేశారు.

విద్యా ప్రమాణాల మెరుగునకు కృషి


పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

బోధన్,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని ఊట్‌పల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, రికార్డులు, బోధన సిబ్బంది హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల బేస్‌లైన్ పరీక్ష నిర్వహణ, అసైన్‌మెంట్‌లు, తదితర అంశాలపై విచారించారు. ఉపాధ్యాయుల నియమిత హాజరు, సమర్థవంతమైన బోధన పద్ధతులు, విద్యార్థుల సమయానుకూల మూల్యాంకనం పట్ల ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యా ప్రమాణాలు మరింత మెరుగు అయ్యే అవకాశం ఉంటుందని, అందుకు కృషి చేయాలన్నారు.

యువత ఉన్నత స్థాయిలో స్థిరపడాలి: సీపీ


బహుమతులు అందజేస్తున్న సీపీ సాయిచైతన్య

జక్రాన్‌పల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): యువత మంచి మార్గంలో నడిచి తాము ఎంచుకున్న ఆశయ సాధనకు కృషి చేస్తు భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో రాణించాలని సీపీ సాయిచైతన్య అన్నారు. జక్రాన్‌పల్లిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు గురువారం రాత్రి ముగిశాయి. ఈ కార్యక్రమానికి సీపీ సాయిచైతన్య హాజరై మాట్లాడుతూ యువత సన్మార్గంలో నడిచినప్పుడు దేశ భవిష్యత్తు బాగుంటుందన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండలన్నారు. మంచి మార్గంలో నడిచి తోటి మిత్రులకు ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం వాలీబాల్ క్రీడల్లో గెలుపొందిన ప్రథమ, తృతీయ, ద్వితీయ స్థానాల జట్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎం. సాయిరెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి, డిచ్‌పల్లి సీఐ వినోద్, స్థానిక ఎస్సై ఎండి మాలిక్ రహ్మాన్, రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, మాజీ సర్పంచ్‌లు కాటిపల్లి నర్సారెడ్డి, బాలకిషన్, మాజీ ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


నియామకపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా సంతోష్ నాయక్

జక్రాన్‌పల్లి,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బంజార సేవా సంఘ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నల్లగుట్ట తండాకు చెందిన సంతోష్ నాయక్‌ను నియమించారు. ఈ మేర కు గురువారం సంతోస్ నాయక్‌కు ఆల్ ఇండియా బంజార సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు.

పసుపు పరిశోధన కేంద్రానికి ఒడిస్సా రైతులు

కమ్మర్‌పల్లి, అక్టోబరు16: (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం పసుపు పరిశోధన కేంద్రాన్ని స్పైస్ బోర్డు వంగల్‌వారి ఆధ్వర్యంలో ఒడిస్సాకు చెందిన 40 మంది పసుపు రైతులు గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పసుపు పరిశోధనలు, పసుపు వంగడాలు, యంత్రపరికరాలు, అవి పనిచేసేవిదానం, కేంద్రలో చేడుతున్న పసుపు పరిశోధనలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలలించారు. పసుపు పంటలను పండించే విధానం, మెళుకువలను కమ్మర్‌పల్లి పసుపు కేంద్రం శాస్త్రవేత్త మహేందర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక శాస్త్రవేత్తలు, కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పసుపు యంత్ర పరికరాలను పరిశీలిస్తున్న ఒడిస్సా రైతులు


మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీవో మధుసూదన్

కొనుగోలు కేంద్రాల నిర్వహణపై శిక్షణ

ఆర్మూర్, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్‌డీవో మధుసూదన్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. 17 తేమశాతంతో పాటు ఇతర వ్యవసాయ వ్యర్థాలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని తూకం వేసి అలాట్‌మెంట్ ఇచ్చిన రైస్‌మిల్లుకు ధాన్యాన్ని తరలించాలన్నారు. అదే విధంగా రైతుల వారీగా తూకం వేసిన ధాన్యానికి తూకం వేసే ముందు రైతు నుంచి పట్టాదార్ పాస్‌పుస్తకం, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు తీసుకొని ట్యాబ్ ఎంట్రీ చేసి రైతులకు సకాలంలో వారి ఖాతాలలో డబ్బులు జమయ్యేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్ర నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్‌లను పకడ్బందిగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం మోహన్, వివిధ మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాలతో బోధన్ విద్యాసంస్థల కరస్పాండెంట్లు

బోధన్ వాసులకు అవార్డులు

బోధన్, సాలూర, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): అబ్దుల్ కలాం 94వ జయంతి సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బోధన్‌కు చెందిన విద్యాసంస్థల కరస్పాండెంట్‌లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. లీడ్ ఇండియా, ట్రస్మా సంయుక్త ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి, స్వర్గీయ అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గురువారం రాష్ట్రంలోని ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా బోధన్ విద్యాసంస్థలకు చెందిన డివిజన్ అధ్యక్షులు మిద్దెల రాజు, పట్టణ అధ్యక్షులు ముత్యాల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి మంతెష్ సురేష్‌లను సన్మానించినట్లు ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కిషోర్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, లీడ్ ఆర్గనైజర్ సుదర్శన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్ కుమార్‌లతో విద్యాసంస్థల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.



ఆస్పత్రి ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

వేతన బకాయిలు చెల్లించాలంటూ కార్మికుల ధర్నా

బాన్సువాడ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో పని చేస్తున్న కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలంటూ గురువారం ఆస్పత్రి ముందు కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగల వేళ జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. డబ్బులు లేక అప్పులు చేయాల్సి వస్తోందని, జీతాలు లేకుండా విధులు ఎలా నిర్వహించగలమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ఏజెన్సీ నిర్వాహకులు తమకు బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి కార్మికులు తదితరులున్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం



అయ్యప్ప ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

బాన్సువాడ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్వరాష్ట్రం కోసం 1969 నుంచి ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఉద్యమించిన డా. బాపురెడ్డి జ్ఞాపకార్థం గురువారం పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు మలిదశ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో డా. బాపురెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాబుషిందే, నార్ల రత్నకుమార్, కొత్తకొండ భాస్కర్, మలిదశ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఉడుత గంగాధర్, చందు, కాల్వ శ్యాం, భాస్కర్‌గౌడ్, రాజు, కృష్ణ, హన్మాండ్లు తదితరులున్నారు.

బాన్సువాడ సీఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు



బాన్సువాడ సీఐ శ్రీధర్‌ను సన్మానిస్తున్న నాయకులు

బాన్సువాడటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్‌ను గురువారం కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కిరణ్, వెంకటేశ్, రాజశేఖర్, ప్రణయ్‌స్వామి తదితరులున్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

మద్నూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నేడు 17 శుక్రవారం మేనూర్ విద్యుత్ ఉప కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు బిచ్కుంద ట్రాన్స్‌కో ఏడీఏ సంజీవరావు తెలిపారు. ఈ కార్యక్రమం సీజీఆర్ఎఫ్ -2 చైర్ పర్సన్ ఎరుకల నారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, డోంగ్లి మండలాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను ఈ వేదిక ద్వారా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

.. ప్రసాద విక్రయాల టెండర్

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మాధవనగర్ సాయిబాబా దేవాలయ ప్రసాద విక్రయాల టెండర్‌ను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీరాం రవీందర్‌గుప్త ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 11గంటలకు బహిరంగ వేలం పాట ఉంటుందని అన్నారు. నవంబరు 1 నుంచి 2026 అక్టోబర్ 31 వరకు సంవత్సరం పాటు పులిహోర, లడ్డు విక్రయాలు చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. 20వేల రూపాయలు డిపాజిట్ టెండర్‌లో పాల్గొనవచ్చని వ్యాపారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి చలో రాజ్‌భవన్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈనెల 17న చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ రాజ్‌భవన్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వెంటనే 42 శాతం రిజర్వేషన్‌పై చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో రిజర్వేషన్ల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్దివెంకట్రాములు, శంకర్‌గౌడ్, నూర్జహాన్ పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

భీమ్‌గల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రానికి చెందిన భూక్య మహిపాల్ మండల కాంగ్రెస్ నాయకులు రూ. 2 లక్షల 50వేలు ఎల్ఓసీని అందజేశారు. మహిపాల్ అత్యవసర పరిస్థితులలో హైదరాబాద్‌లో ఆస్పత్రిలో చేరగా పరీక్షల అనంతరం వైద్యులు ఆపరేషన్ చేయాలని డాక్టర్లు సూచించడంతో వైద్య సహాయం కోసం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్‌ను సంప్రదించగా ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 2లక్షల 50వేలు మంజూరు చేయించారు. మంజూరైన చెక్కును గురువారం మండల కాంగ్రెస్ నాయకులు బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భవిత భవన్‌లో ఫిజియోథెరపీ శిబిరం

బాన్సువాడటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవిత భవన్‌లో గురువారం దివ్యాంగ చిన్నారులకు వైద్యుడు గంగాధర్ ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించారు. తల్లిదండ్రులు దివ్యాంగ చిన్నారులకు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వ్యాయామం చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులున్నారు.



భవిత భవన్‌లో దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న వైద్యుడు

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతంగా ఎదగాలి

» సినీ నటి రోహిణి



సినీ నటి రోహిణి సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఆర్మూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లి దండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని సినీ నటి రోహిణి అన్నారు. ఆర్మూర్‌లోని విజయ్ హైస్కూల్‌లో గురువారం సాయంత్రం నిర్వహించిన 44వ టాలెంట్ షోకు సినీ నటి రోహిణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువులో లక్ష్యాలను ఏర్పర్చుకొని వాటి సాధనకు కృషి చేస్తే విజయం మీ సొంతం అవుతుందన్నారు. ప్రముఖ రచయిత్రి సంధ్య విప్లవ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభ ఇలాంటి కార్యక్రమాల ద్వారనే వెలుగులోకి వస్తుందన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి ని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో విజయ్ విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత, కరస్పాండెంట్ కవితా దివాకర్, ప్రిన్సిపాల్ రమాదేవి, వసంత, ప్రభ, కిరణ్‌బాల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

రేపటి బంద్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పార్టీ కార్యదర్శి వనమాల కృష్ణ

నిజామాబాద్ కల్చరల్, అక్టోబ రు 16 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల జేఏసీ నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాల జేఏసీ నాయకత్వంలో 18న రాష్ట్ర బంద్‌కు సీపీఐఎంఎల్ ప్రజాపంథా మద్దతు ఉంటుందని అన్నారు. అసెంబ్లీలో చర్చ జరిగి అన్ని రాజకీయ పార్టీలు రిజర్వేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించాయని అన్నారు. గవర్నర్ బిల్లును ఆమోదించకపోవడంతో పెండింగ్ వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయింపుతోనే స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైందని హైకోర్టు స్టే విధించడంతో ఎన్నికలు ఆగిపోయాయని అన్నారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి వెంకన్న, బోధన్ డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్, నగర కార్యదర్శి సుధాకర్, నాయకులు గంగాధర్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

బహుజన లెఫ్ట్ పార్టీ మద్దతు

రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ నాయకత్వంలో నిర్వహించే రాష్ట్ర బంద్‌కు బహుజన లెఫ్ట్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండివెంకట్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోగల జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేయడానికి రాజ్యాంగంలో 9వ షెడ్యూల్‌లో చేర్చే విధంగా తెలంగాణ రాష్ట్రంలోని బీసీ కులాల ప్రజలు బీజేపీ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈనెల 18న బంద్‌కు పిలుపునిచ్చాయని అన్నారు. బంద్‌లో ప్రతీఒక్కరు పాల్గొని ఉద్యమ స్ఫూర్తి నింపాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు లత, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కమిటీ సభ్యులు సంజయ్, మంగేష్, గజానంద్, శ్రీను, అనిల్, రేఖ, శాంతాబా, మౌనిక, సమంత తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ మద్దతు తెలపాలి: బీసీ జేఏసీ కన్వీనర్

బోధన్: ఈ నెల 18న బీసీ సంఘాల జేఏసీ కార్యాచరణ ఆధ్వర్యంలో చేపట్టనున్న బంద్‌కు బోధన్ నియోజకవర్గంలోని అన్ని వ్యాపారస్తులు, వివిధ రంగాల సంస్థలు బంద్ పాటించి సంపూర్ణ మద్దతు తెలపాలని బీసీ సంఘాల జేఏసీ కన్వీనర్ రవీందర్ యాదవ్ కోరారు. గురువారం బోధన్ పట్టణంలోని పలు వ్యాపారస్తుల వద్దకు వెళ్లి బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల జేఏసీ నేతలు సుధాకర్ చారి, అబ్బగోని గంగాధర్ గౌడ్, సంతోష్, నాగుల రవి శంకర్ గౌడ్, అశోక్ చారి పాల్గొన్నారు.

బీఎస్పీ సంపూర్ణ మద్దతు

18న బీసీ రాష్ట్ర బంద్‌కు బీఎస్పీ పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ బంద్‌లఓ పాల్గొనడం జరుగుతుందని బీఎస్పీ బోధన్ అసెంబ్లీ ఇన్‌చార్జి నీరడి రవి, అధ్యక్షులు రమేష్ దాస్ తెలిపారు.

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) మద్దతు

బీసీ బంద్‌కు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) సంపూర్ణ మద్దతు ఇస్తుందని బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ తెలిపారు. అలాగే బీసీ బంద్‌కు విద్యార్థి సంఘాల జేఏసీ పూర్తి మద్దతు ఇస్తూ బంద్‌లో పాల్గొనడం జరుగుతుందని విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ నాగరాజు తెలిపారు.



మాట్లాడుతున్న బీఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్



బంద్‌కు మద్దతు తెలపాలని బీసీ సంఘాల నాయకుల దృశ్యం



అదనపు కలెక్టర్‌ను కలిసిన టీజేఎస్ ప్రతినిధులు

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

సుభాష్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ తెలంగాణ జన సమితి అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని అదనపు కలెక్టర్ చాంబర్ లో నగర అధ్యక్షుడు వెంకట్ నాయకత్వంలో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ తెలంగాణ శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని అన్నారు. అదనపు కలెక్టర్‌ను కలిసిన వారిలో కిరణ్, గంగాధర్, సలీమ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో జోనల్ స్థాయి క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన విద్యార్థుల దృశ్యం

రుద్రూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో గురువారం జోనల్ స్థాయి క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. పోతంగల్, కోటగిరి, రుద్రూరు మండలాలకు చెందిన విద్యార్థులకు అండర్-14, అండర్-17 ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. అండర్-14 బాలుర విభాగంలో వాలీబాల్, అండర్-17 బాలుర, బాలికల విభాగంలో కబడ్డీ, అండర్-14, అండర్-17 బాలుర విభాగంలో ఖోఖో పోటీలు నిర్వహించారు. ఇందులో 150మంది విద్యార్థులు పాల్గొని పోటీల్లో తలపడ్డారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జోనల్ స్థాయి క్రీడాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాంసింగ్, పద్మావతి, సుజాత, శ్యామల, పీఆర్‌టీయూ అధ్యక్షులు విఠల్ రెడ్డి, గంగారాం, రమణ, పీడీలు ప్రతిభ, విశాల్, సిద్ధ్, సాయి పాల్గొన్నారు.

ఓపెన్ హౌజ్‌పై విద్యార్థులకు అవగాహన

ముప్కాల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బాల్కొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బాల్కొండ పోలీస్ స్టేషన్ పోలీస్ బృందం ఆధ్వర్యంలో ఓపెన్ హౌజ్ పై విద్యార్థులకు అవగాహన గురువారం కల్పించారు. పోలీసుల విధులు, ఆయుధాల ఉపయోగం, లాకప్ గదులను,రిజిస్టర్ల నిర్వహణపై అవగాహన కల్పించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శైలేందర్

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు: ఎస్సై



టపాసుల యజమానులకు సూచనలు ఇస్తున్న ఎస్సై కళ్యాణి

ధర్పల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా టపాసుల యజమానులు గీత దాటితే చర్యలు తప్పవని ఎస్సై కళ్యాణి అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన టపాసుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్సు లేని టపాసుల దుకాణాలను మూసివేస్తామన్నారు. ఎక్స్‌ప్లోజివ్ చట్టం 1884, ఎక్స్‌ప్లోజివ్ నిబంధన 2008 ప్రకారం చెల్లుబాటు అయ్యే లైసెన్స్ పొంది టపాసుల దుకాణం తెరవాలన్నారు. దుకాణంలో స్పష్టంగా లైసెన్సును ప్రదర్శించాలని ఆమె సూచించారు. నివాస గృహాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, పెట్రోల్ బంక్‌లు వాటికి దూరంగా దుకాణాలు ఉండాలన్నారు. ఖచ్చితంగా విద్యుత్‌శాఖ, అగ్నిమాపక అనుమతి ఖచ్చితంగా తీసుకోవాలని మైనర్లకు టపాసులు అమ్మరాదన్నారు. దుకాణాల్లో మంటల నియంత్రణ పరికరాలు ఉండాలన్నారు. దుకాణాల లోపల, సమీపంలో టపాకాయలు పేల్చడం, పరీక్షించడం నిషేదం అని పేర్కొన్నారు. ఈ సూచనలు పాటించని పక్షంలో లైసెన్సును రద్దుచేసి స్టాక్‌ను స్వాధీనం చేసుకొని చట్టపరమైన చర్యలు చేపడుతామని అన్నారు. మండల ప్రజలు పోలీసులతో సహకరించాలని దీపావళి పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆమె సూచించారు.

ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల సమాజ రక్షణలో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి వీరమరణం పొందిన అమరవీరుల పోలీసుల జ్ఞాపకార్థం ఔత్సాహిక యువతీ యువకులకు, విద్యార్థిని విద్యార్థులకు, ఫొటోగ్రాఫర్లకు ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పోలీస్ పీఆర్‌వో ఒక ప్రకటనలో తెలిపింది. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఆదేశాల మేరకు నిజామాబాద్, ఆర్మూర్ బోధన్ డివిజన్ పరిధిలో ఆసక్తిగల వారు ఈ పోటీలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 2024 అక్టోబర్ నుంచి 2025 అక్టోబర్ వరకు అత్యవసర సమయంలో పోలీస్ సేవలు ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల విధులు, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మత్తుపదార్థాల నిషేధంలో పోలీసుల కృషి వంటి వాటిని తీసిన ఫొటోలను, షార్ట్‌ఫిల్మ్‌లను అందించాలన్నారు. 3 ఫోటోలను, 3 నిమిషాల కంటే తక్కువ వీడియోలను పంపించాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈ నెల 24వ తేదీ సాయంత్రం లోగా కమిషనరేట్ పోలీస్ కార్యాలయంలోని పోలీస్ పీఆర్‌వోకు అందజేయాలన్నారు. షార్ట్ ఫిల్మ్ 3 నిమిషాల లోపు, ఫోటోలు 10 బై 8 సైజు గల ఫోటోలను పెన్ డ్రైవ్‌లో అప్‌లోడ్ చేసి అందించాలన్నారు. కమిషనరేట్ స్థాయిలో ఎంపికైన 3షార్ట్‌ఫిల్మ్, ఫోటోగ్రాఫీలను రాష్ట్రస్థాయి పోటీలకు రాష్ట్ర డీజీపీ హైదరాబాద్‌కు పంపించామ న్నారు. పూర్తి వివరాలకు 94400 01827 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ ఉప కేంద్ర నిర్మాణానికి భూమిపూజ

సాలూర,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): సాలూర మండలం జాడిజమాల్‌పూర్ గ్రామంలో గురువారం అధికారులు, నాయకులు నూతన ఉప విద్యుత్ కేంద్రానికి భూమిపూజ చేశారు. ఉప విద్యుత్ కేంద్రానికి 1 కోటి 92 లక్షల నిధులు మంజూరు అయినట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ ఉప కేంద్రం మంజూరు చేసిన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డికి పరిధి ప్రజలు, రైతుల తరఫున కాంగ్రెస్ పార్టీ నాయకులు సుందర్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణ విషయంలో గ్రామస్థులు, రైతులు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్వామి, కన్‌స్ట్రక్షన్ ఏడీ తోట రాజశేఖర్, బోధన్ ఆపరేషన్ ఏడీ నాగేష్ కుమార్, కన్‌స్ట్రక్షన్ ఏఈ సుమిత, బోధన్ టౌన్2 ఆపరేషన్ కళ్యాణ్, సివిల్ కార్తీక్, గ్రామస్థులు శ్రీనివాస్ రావు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు



పసుపు ఉత్పత్తుల పరిశ్రమను సందర్శించిన పలు రాష్ట్రాల రైతులు

మనోహరాబాద్‌లో పసుపు ఉత్పత్తుల పరిశ్రమను సందర్శించిన నాలుగు రాష్ట్రాల రైతులు

జక్రాన్‌పల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహరబాద్ గ్రామంలో గురువారం పసుపు ఉత్పత్తుల పరిశ్రమను వివిధ రాష్ట్రాల రైతులు సందర్శించారు. వరంగల్, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఒడిస్సా రాష్ట్రాలకు చెందిన 40 మంది రైతులు సందర్శించి పరిశ్రమలో ఉన్న పసుపు పౌడర్ తయారు చేసే యంత్రాలను పరిశీలించారు. అనంతరం పరిశ్రమలో ఉన్న యంత్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట జేఎంకేపీఎం సూపర్ వైజర్ రుత్విక్, అసిస్టెంట్ డైరెక్టర్ జోతీష్, సిబ్బంది, రైతులు ఉన్నారు.

రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గౌడ కులస్థులు

ఎల్లారెడ్డి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఈ నెల 24న శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని చింతల పోచమ్మ ప్రతిష్ఠాపన కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు ఎల్లారెడ్డి గౌడ సంఘం కులస్థులు గురువారం హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసి మొదటి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 24 నుండి 28 వరకు నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు బ్రాహ్మణ పురోహితులతో పూజా కార్యక్రమాలు, ఎల్లమ్మ తల్లి బోనాలు, పోతరాజుల విన్యాసాలు తదితర కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. గౌడ సంఘం కులస్తుల ఆహ్వానం మేరకు ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేసిన వారిలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, బాలకిషన్ బాలకిషన్, శ్రీనివాస్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, శ్యామ్ గౌడ్, కిషన్ గౌడ్, నారా గౌడ్, సిద్ధా గౌడ్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆహార దినోత్సవం

రుద్రూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రుద్రూరులోని ఆహార శాస్త్రం, విజ్ఞాన కళాశాలలో గురువారం ఆహార దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల దత్తత గ్రామమైన రాయకూర్ పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, మహిళ రైతులకు రంగోళి, వంటల పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ ఇండస్ట్రీ కామధేను సీఈవో వెంకటేశం, ఆర్ఎస్ అండ్ ఆర్ఆర్ఎస్ రుద్రూర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ పవన్ చంద్రారెడ్డి, కేవీకే హెడ్ డాక్టర్ హిందూధర్ రెడ్డి, డాక్టర్ కే.వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 18న రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం వైస్ ప్రెసిడెంట్ పాక రవిప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ జాతీయ నాయకుడు పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు కామారెడ్డి డిక్లరేషన్‌లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినట్లయితే బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని ప్రకటించారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ ఆదేశాలతో బీసీ సంఘాలన్నీ ఏకమై బంద్‌కు పిలుపునిచ్చాయని జిల్లాలోని గంగపుత్రులందరు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు.

బంద్‌కు సహకరించాలి: ప్రజా సంఘాలు

ఈనెల 18న నిర్వహించే బీసీ సంఘాలు ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ప్రజా సంఘాలైన బీసీ సంక్షేమ సంఘం, తెలంగాణ జనసమితి, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

కల్యాణ కష్టాలు..!

» కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పత్రాలపై సంతకానికి సహకరించని గెజిటెడ్ ఆఫీసర్లు » కాళ్లరిగేలా తిరుగుతున్న దరఖాస్తుదారులు

డొంకేశ్వర్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులపై గెజిట్ అధికారి సంతకం చేయించడంలో మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దరఖాస్తు పూర్తి చేయడం అవసరమైన సర్టిఫికెట్లను ఆ ఫాంకి జత చేయడం ఒక పని అయితే.. దానిపై గెజిటెడ్ అధికారి సంతకం చేపియ్యడం దరఖాస్తుదారులకు పెద్ద సమస్యగా మారింది. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకి గెజిటెడ్ అధికారి సంతకం చేయించి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుంది.

కార్యాలయాల చుట్టూ తిరుగుతూ..

డొంకేశ్వర్ మండలంలోని ఓ వ్యక్తికి చెందిన కుటుంబ సభ్యులలో ఒక్కరికి వివాహమైంది కల్యాణలక్ష్మి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి గెజిట్ అధికారి సంతకం అవసరం కాగా.. మండలంలో ఉన్న కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయారు. ఏ అధికారి కూడా సంతకం చెయ్యలేదు. ఇటువంటి సమస్య చాలా మంది మండల ప్రజలకు ఎదురవుతున్నాయి. చాలా మంది లబ్ధిదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా సంతకాలు పెట్టడం లేదు.



తెలిసిన వారైతే ముందుకు..

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులకు మొదటి వివాహమా అని ధ్రువీకరించడానికి ఈ సంతకం తప్పనిసరి అవసరం. బాగా తెలిసిన వారు కొంచెం చెబితే గెజిటెడ్ అధికారి సంతకం చేసేందుకు ముందుకువస్తున్నారు. ఆ దరఖాస్తు ఫారాన్ని మూడు రోజుల పాటు తమ వద్ద పెట్టుకొని పూర్తిగా ఎంక్వైరీ చేసుకున్న తరువాత సంతకం చేస్తున్నారు. ముక్కు ముఖం తెలియకుండా సంతకాలు చేసి తలనొప్పులు తెచ్చుకోవాల్సి వస్తుందేమోనని భయం కొందరు అధికారుల్లో ఉంది. ఇటువంటి ఇబ్బందులను చూసి కొందరు విసుగుచెంది పథకాలకు దరఖాస్తు చేయకుండానే విడిచి పెడుతున్నారు. దీనిని గమనించి గెజిట్ అధికారి సంతకం విషయంలో వెసులుబాటు కల్పిం చాలని ప్రజలు కోరుతున్నారు.

అన్ని పత్రాలు చూసి సంతకం చేయాలి



కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తుదారులకు అన్ని పత్రాలు సరిచూసి తప్పనిసరిగా గెజిటెడ్ అధికారి సంతకం చేయాలి. గెజిటెడ్ అధికారి సంతకం తప్పనిసరని నిబంధనలు పెట్టింది. సంతకాలు చేయకపోవడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులుపడుతున్నారు.-**నాగరాజు. డొంకేశ్వర్**



సీపీఆర్ చేసే విధానాన్ని వివరిస్తున్న వైద్యులు, చిత్రంలో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు

సీపీఆర్‌పై అందరికీ అవగాహన అవసరం

సుభాష్‌నగర్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి) : ఆకస్మిక గుండెపోటుకు గురైన వ్యక్తులకు సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలను రక్షించవచ్చని, దీనిపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. ఐడీఓసీ సమావేశ మందిరంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సీపీఆర్(కార్డియో పల్మోనరీ రిసిసిటేషన్) అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జీవితంలో అకస్మాత్తుగా కొందరికి గుండెపోటు వచ్చి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అలాంటి వారికి సీపీఆర్‌తో ప్రథమ చికిత్స అందజేస్తే ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడతారని పేర్కొన్నారు. ఓ వ్యక్తికి ఆకస్మిక కార్డియాక్ అరెస్ట్ వచ్చినప్పుడు, వైద్య సహాయం అందేలోపు ఛాతీని 30సార్లు నొక్కి, 2శ్వాసలు ఇవ్వడం (30:2 రేషియో)ద్వారా గుండెను సాధారణ స్థితికి తీసుకు రావచ్చని తెలిపారు. కార్డియాక్ హెల్త్ కేర్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు జిల్లాలో సీపీఆర్‌పై ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ విధానంపై గ్రామాల నుంచి పట్టణాల దాకా అందరిలోనూ అవగాహన పెంచేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సీపీఆర్ ఎలా చేయాలన్న దానిపై మాస్టర్ ట్రైనర్స్ డాక్టర్ వెంకటేష్, వేణుగోపాల్ ప్రయోగపూర్వకంగా తెలియజేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తీయాన్ మావీ, జిల్లా వైద్య అధికారిణి డాక్టర్ రాజశ్రీ, హౌసింగ్ పీడీ పవన్ కుమార్, డిప్యూటీ సీఈఓ సాయన్న, హౌసింగ్ ఏఈలు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తెలంగాణ రైజింగ్ విజన్ సర్వేలో భాగస్వాములు కావాలి

కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):రాష్ట్రాన్ని రానున్న రోజులలో అభివృద్ధి, సంక్షేమ రంగాలలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ విజన్ - 2047" అంశాలతో డాక్యుమెంటును రూపొందిస్తుందని, ఈ సర్వేలో ఉద్యోగులు, అన్నివర్గాల వారు భాగస్వాములు కావాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఈ విజన్ 2047 డాక్యుమెంట్ తయారీలో ప్రతి పౌరుడు పాల్గొనేలా సిటిజన్ సర్వే చేపట్టారన్నారు. అక్టోబరు 10వ తేదీన ప్రారంభమైన ఈ సర్వేలో ఇప్పటికే ప్రజలు, ప్రవాస భారతీయులు పెద్దఎత్తున పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సర్వేలో ప్రతీ ఉద్యోగి పాల్గొని తమ సలహాలు, సూచనలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14వ తేదీన సర్క్యులర్ జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. ఈనెల 25 వ తేదీ వరకు కొనసాగే విజన్-2047 సర్వేలో అందరు ఉద్యోగులు పాల్గొనడంతో పాటు ఈ సర్వే లింక్‌ను, క్యూఆర్ కోడ్‌ను తమ కార్యాలయాల్లో ప్రదర్శించాలని, ఈసర్వే గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

సీపీ సాయిచైతన్య

సుభాష్‌నగర్,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):నగర ప్రజలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించ వద్దని సీపీ సాయిచైతన్య గురువారం ప్రకటనలో కోరారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అనుమతి లేకుండా ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్ఠించరాదని, ముఖ్యంగా రద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాల లాంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేయరాదన్నారు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ అనుమతులు తప్పనిసరిగా పొందాల్సి ఉంటుందని తెలిపారు. ఎక్కువ శబ్దంతో వచ్చే డీజేలను ఏర్పాటు చేయరాదన్నారు. రాత్రి సమయంలో గృహాల సముదాయంలో 55 డెసిబెల్స్ సౌండ్ వాడాలన్నారు. రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల వరకు డీజే సౌండ్ సిస్టమ్‌లు పూర్తిగా నిషేదం అని తెలిపారు. డీజేలకు పోలీసుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలన్నారు. ఊరేగింపులు, సభల నిర్వాహణలకు అనుమతులు ఉండాలన్నారు. లౌడ్ స్పీకర్ పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుంచి ముందస్తుగా అనుమతులు తీసుకోవాలన్నారు. 500 మంది కంటే ఎక్కువ జనాలతో కూడిన కార్యక్రమానికి 72 గంటల ముందుగా పోలీస్ కమిషనర్ అనుమతి తీసుకోవాలన్నారు. సార్వజనిక ప్రదేశాల్లో సెక్యూరిటీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. డ్రోన్‌ల వినియోగంపై ఆంక్షలున్నాయని డ్రోన్‌ల వినియోగంపై ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు. నకిలీ ఏజెంట్ల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నకిలీ ఏజెంట్లకు అద్దెకు ఇచ్చేవారు వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఉత్తర్వులు ఈనెల 16 నుంచి 31 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు.

కార్మికుల పొట్టకొట్టొద్దు

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పొట్టకొట్టద్దని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధాకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన 11వ మహాసభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు నిత్యం గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, డంపింగ్ యార్డ్ వంటి ఎన్నో నిర్వాహణ బాధ్యతలు వహిస్తున్నారని అలాంటి వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు రాధా, పెద్దివెంకట్రాములు, గంగాధర్, వెంకటేశ్, సిర్పలింగం, సాగర్, రాజేశ్వరి, రాజేష్, లింగం, చిన్నలాలు, పద్మ, శిల్ప, సాయిలు తదితరులున్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధాకర్

తాలు, మట్టి రాకుండా చూడాలి

కోటగిరి,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): వరిపంటను కోసే సమయంలో తాలు, మట్టి, గడ్డి రాకుండా చూడాలని తహసీల్దార్ గంగాధర్ సూచించారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రైతులు, వరికోత మిషన్ యాజమానులు, డ్రైవర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వరి చేను పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతే కోయాలన్నారు. కోత మిషన్ ఉపయోగించే సమయంలో బ్లోయర్ ఆన్‌లో ఉండాలన్నారు. కోత మిషన్ ఆర్‌పీఎం 19-20కి పైన ఉండాలన్నారు. గేర్‌స్లోట్ ఏ2 నుంచి బీ1లో పెట్టి వరికోత కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో కోటగిరి, పోతంగల్ మండలాల వ్యవసాయ అధికారులు రాజు, నిశిత తదితరులు పాల్గొన్నారు.

అంబం చెరువుకు పొంచి ఉన్న ప్రమాదం

ఎడపల్లి,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబం గ్రామ చెరువుకు తూము వద్ద కట్టకు పెద్ద గుంత ఏర్పడింది. ఈ గుంత 10ఫీట్ల లోతు వరకు ఉందని, దీంతో చెరువుకు గండి పడే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే ఈ సమాచారాన్ని గ్రామస్థులు నీటి పారుదల శాఖ అధికారులకు అందించారు. చెరువు కట్టకు ఏర్పడిన గుంతను సంబంధిత అధికారులు వెంటనే పూడ్చాలని లేనిపక్షంలో చెరువుకు గండిపడి గ్రామంలోకి, కోతకు వచ్చిన పంట పొలాలు మునిగి పోయే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు.



అంబం చెరువు కట్టకు ఏర్పడిన గుంత దృశ్యం

పావు కిలో బంగారంతో కార్మికుడి పరార్

నిజామాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓ బెంగాలీ కార్మికుడి చేతిలో బంగారు వ్యాపారులు ఘోరంగా మోసపోయారు. పసిడికి మెరుగులద్దే ఆ కార్మికుడికి పెద్ద మొత్తంలో బంగారం ఇచ్చి నిలువుగా మోసపోయారు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలో వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా కేంద్రంలోని గంజ్ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పసిడికి మెరుగులద్దే బెంగాలీ కార్మికుడు ఇక్కడ కొన్నేళ్లుగా షాప్ నడుపుతున్నాడు. అందరినీ నమ్మబలికాడు. కొన్నేళ్లుగా నమ్మకంగా పనిచేస్తుండటంతో బంగారు వ్యాపారులు, ఆభరణాల తయారీదారులు తాము విక్రయించే బంగారు ఆభరణాలకు అవసరమైన పాలిష్ ఇతడితోనే చేయించుకునేవారు. బెంగాల్ కార్మికుడు ఎత్తుకెళ్లిన బంగారం పావు కిలో పైన ఉండి విలువ రూ. 30 లక్షల వరకు ఉంటుందని అంచనా. నగరంలోని ఒకటో టౌన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. దీనిపై వ్యాపారులు ఫిర్యాదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

టీటీడీ బృందం పర్యటన

ఆలూర్ ,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి స్థాపతి, ఇంజినీర్ల బృందం మండలంలో పర్యటించింది. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలికి ఈ ప్రాంతంలో పలు మందిరాల నిర్మాణం జరుగుతున్నందున, దేగాం శ్రీలక్ష్మీ నారాయణ మందిరానికి మరమ్మతుకు సహకరించాలని పాలకమండలి కోరగా.. టీటీడీ బృందాన్ని ఇక్కడికి పంపింది.

జీవనశైలిలో మార్పే సమస్యలకు కారణం

సుభాష్‌నగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జీవనశైలిలో ఎక్కువ సేపు కూర్చోవడం, పనిచేయడం, మొబైల్, ల్యాప్‌టాప్‌ల అధిక వాడకంతో వెన్నుముక సమస్యలు వస్తున్నాయని వెన్నుముక సురక్షితమైన శస్త్రచికిత్స అవసరమని మెడికవర్ ఆసుపత్రి న్యూరోసర్జన్ డాక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. గురువారం ప్రపంచ వెన్నుముక దినోత్సవం, అనెస్తీషియా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 300లకు పైగా న్యూరో సర్జరీలు పూర్తి చేయడం జరిగిందన్నారు. వెన్నుముక సమస్యలు ఈ మధ్యకాలంలో పెరిగిపోయాయని, చిన్న వయస్సులోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. సమస్య అధికమైతే సురక్షితమైన శస్త్రచికిత్స చేయడం మంచిదన్నారు. శస్త్రచికిత్సలో అనెస్తీషియా పాత్ర కీలకమైనదన్నారు. మెడికవర్ ఆసుపత్రిలో డాక్టర్ వాసు అనెస్తీషియాలో అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ యజ్ఞ, సెంటర్ హెడ్ స్వామి, మార్కెటింగ్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యూరో సర్జన్ కృష్ణ ఆదిత్య



ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న మహిళా పారిశ్రామిక వేత్తలు

ఉత్సాహంగా ప్రదర్శన

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలో మొట్టమొదటిసారిగా సాక్షం గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా పారిశ్రామిక వేత్తల ప్రదర్శన, అమ్మకాలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా కేంద్రంలో అశోక్ అవెన్యూ క్లబ్ హౌజ్‌లో నిర్వహించిన మహిళా పారిశ్రామిక వేత్తల ప్రదర్శన, అమ్మకాల కార్యక్రమానికి వ్యవస్థాపకురాలు యోగితా సోమాని, శ్వేతా గుప్త హాజరై తిలకించారు. 18 మందికి పైగా మహిళా పారిశ్రామిక వేత్తలు తమ ఉత్పత్తులు, సృజనాత్మకత వ్యాపార ఆలోచనలు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. వెయ్యి మందికి పైగా సందర్శకులు మహిళల ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాపార ఉత్పత్తులను తిలకించారన్నారు. కార్యక్రమంలో గ్రూప్ ప్రతినిధులు, అశోక అవెన్యూ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మూత'బడి'

(3వ పేజీ తరువాయి)

స్థానికులు వాపోతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో బడిబాట ద్వారా హడావిడి చేసే అధికారులు.. నిరంతర పర్యవేక్షణ చేపట్టి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్తచెదారం..

విద్యాలయాలుగా చెప్పుకొనే ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు లేరని సాకుతో మూసివేయడంతో చెత్తాచెదారంతో దర్శనమిస్తూ అపరిశుభ్రంగా మారాయి. సుదర్శన్‌నగర్, గోన్‌గొప్పుల ఎస్సీ కాలనీ పాఠశాలలు తెర్చుకోకపోవడంతో పిచ్చి మొక్కలు మొలచి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మూతపడిన పాఠశాలలు తెరిపించి ప్రభుత్వ పాఠశాలల మనుగడను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

(3వ పేజీ తరువాయి)

ఇందిరమ్మ కమిటీల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆర్థిక ఇబ్బందులున్న లబ్ధిదారులకు ఐకేపీ, మెప్మా ద్వారా విరివిరిగా రుణాలు ఇప్పించాలన్నారు. బిల్లుల చెల్లింపులలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు లబ్ధిదారుల వివరాలు ఆధార్ కార్డు వివరాలతో సరిపోలి ఉన్నాయా అన్నది పరిశీలించుకోవాలన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. తాను ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తానని, ఎప్పటికప్పుడు స్పష్టమైన పురోగతి కనిపించాలన్నారు. సమీక్షలో ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తీ యాన్ మావీ, హౌసింగ్ పీడీ పవన్ కుమార్, జడ్పీ డిప్యూటీ సీఈవో సాయన్న పాల్గొన్నారు.

కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులివ్వాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

సుభాష్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నూతన ఓటర్లకు గుర్తింపు కార్డుల ను తపాలా శాఖ ద్వారా సకాలంలో అందించే విధం గా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధి కారి సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి ఇతర అధికారులతో కలిసి సీఈఓ సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, తహసిల్దార్లతో సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తీయాన్ మావీ, ఏఓ ప్రశాంత్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

బంద్‌కు మాలమహానాడు మద్దతు

సుభాష్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీ కులసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహిస్తున్న బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దేవిదాస్, ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. బహుజనులంతా ఏకధాటిపైకి వచ్చి రిజర్వేషన్లను సాధించుకుందామన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవీపేట,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): నవీపేటలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరుగుతుందని నవీపేట సొసైటీ కార్యదర్శి మహేష్ తెలిపారు. ఉదయం 10గంటలకు సొసైటీ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరుగుతుందని, రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని, తాలు, మట్టి వంటివి లేకుండా చూడాలని రైతులకు సూచించారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని పేర్కొన్నారు. ప్రభుత్వ కొనుగోలుకేంద్రాల్లోనే మద్దతు ధర ఉంటుందన్నారు.

వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

వేల్పూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పశువులకు ముందస్తు టీకాలు వేయించి, వాటి ఆరోగ్యాన్ని కాపాడాలని మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి అన్నారు. గురువారం వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాల వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి సంతోష్ మాట్లాడుతూ .. గాలికుంటు వ్యాధి లక్షణాలు పశుల నోటి నుంచి చొంగ కారడం, నాలుక పగలడం, కాలు గిట్టల మధ్య పుండ్లు ఏర్పడడం, అధిక జ్వరంతో బాధపడడం వంటి లక్షణాలు కనబడుతాయన్నారు. రైతులు ముందస్తు టీకాలు వేయించి పశువులను ఆరోగ్యంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది సురేష్, గంగాధర్, దయానంద్, జావీద్, గ్రామాభివృద్ధి కమిటి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మాక్లూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్లు ఇట్టి అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారులు డాక్టర్ కిరణ్‌దేశ్ పాండే, డాక్టర్ ఉమమ తాహేర్ అన్నారు. గురువారం మండలంలోని మదన్‌పల్లి గ్రామంలో వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వినిత, కళ్యాణి, శ్యామల, షైమాద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలని టెక్నికల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గంగాధరయ్య అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, కోటార్మూర్‌లలో గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. పాడి రైతులు తమ పశువులకు టీకాలు వేయిస్తే అనారోగ్యం బారీన పడకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ లక్కం ప్రభాకర్, పశువైద్య సిబ్బంది రాధ, దివ్య, రాజేశ్వర్, శ్రీనివాస్ గౌడ్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ గంగాధరయ్య

రేపు పశువులకు టీకాలు

ఆర్మూర్ టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో ఈనెల 18న పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇస్తున్నట్లు వెటర్నరీ ఆసుపత్రి డాక్టర్ జియాలొద్దీన్ తెలిపారు. పశువులు, గేదెలకు సామూహిక బాధ, నోటి వ్యాధి టీకా కార్యక్రమం ఈనెల 18న ఉంటుందని రైతులు సేవలను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

సినిమా గైడ్


దేవి : శశివదనే (11.15, 6.15)
: కానిస్టేబుల్ (2.15, 9.15)
విజయ్ : కాంతారా చాప్టర్-1 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ఏఆర్ఐ (11.15, 6.15)
: ట్రాన్ ఏరిస్ (2.15, 9.15)
లలితామహాల్ : ఓజి (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : ఓజి (తెలుగు) (1.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : కానిస్టేబుల్ (11.00, 7.30)
: ట్రాన్ ఏరిస్ (ఇంగ్లీష్) (4.40)
: కాంతారా చాప్టర్-1 (10.20)
స్క్రీన్-3 : కాంతారా చాప్టర్-1 (1.10, 4.25, 7.40)
: ట్రాన్ ఏరిస్ (ఇంగ్లీష్ (10.40)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1 : ట్రాన్ ఏరిస్ (తెలుగు) (10.05)
: కాంతారా చాప్టర్-1 (12.45, 4.10, 7.35, 11.00)
స్క్రీన్-2 : కాంతారా చాప్టర్-1 (10.40, 2.05)
: ట్రాన్ ఏరిస్ (తెలుగు) (5.30)
: ట్రాన్ ఏరిస్ (ఇంగ్లీష్) (8.10, 10.50)
స్క్రీన్-3 : బల్టీ (11.00) : కానిస్టేబుల్ (2.10)
: ఏఆర్ఐ (4.45) : ఓజీ (7.25)
: సన్నీ సంస్కారికి తులసీకుమారి (హిందీ) (10.35)
స్క్రీన్-4 : ఆన్ ది రోడ్ (10.30) : సన్నీ సంస్కారికి తులసీకుమారి (హిందీ) (12.55) : ఓజీ (3.55, 10.35) : కాంతారా చాప్టర్-1 (7.10)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,26,200	రూ.1,16,000	రూ.1700

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.170	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.175	రూ.265	రూ. 285



మొక్కలను సంరక్షించుకోవాలి

మెండోర, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మన ప్రకృతి సంపదైన మొక్కలను ప్రతీ ఒక్కరు సంరక్షించుకోవాలని జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం సీఈ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలో పోచంపాడ్ జెన్‌కో కాలనీలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యుత్ ఉద్యోగులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కను నాటి నాటిన మొక్కను కాపాడుకుంటే ముందు తరాలకు మంచి ఫలాలు ఇవ్వడం మన అందరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఏడీఈలు గంగారాం, సతీష్, నవనీత్, 1104 రాష్ట్ర కార్మిక నాయకుడు రఫిక్, శ్రీనివాస్‌రావు, విద్యుత్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



పోచంపాడ్ జెన్‌కోలో మొక్కలను నాటుతున్న విద్యుత్ ఉద్యోగులు

ఖోఖో పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ముప్కాల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -14, అండర్ -17 బాలబాలికల బాల్కొండ జోనల్ జట్ల ఎంపిక గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిసాన్ నగర్ క్రీడా మైదానంలో నిర్వహించినట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. ఎంపికైన జట్లు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, సింధుజా, మండల క్రీడాధికారి రాజ్‌కుమార్, వ్యాయమ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఎంఈవో రాజేశ్వర్